నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | JAGTIAL

## 'నవోదయ'లో దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, సెప్టెంబర్ 24 : జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2025- 26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు అక్టోబర్ 7 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 8, 9వ తేదీల్లో దరఖాస్తుదారులు పొరపాట్లు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పీజీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 24 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంసీఏ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూలై, ఆగస్టులో నిర్వహించగా, ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అందుకోసం విద్యార్థులు http://103.119.113.107:85, www.satavahana.ac.inలో పరిశీలించుకోవచ్చని సూచించారు.



# నమ్మి ఓటేస్తే.. నోట్లో మట్టికొట్టిన్రు

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం మండల రైతుల ఆగ్రహం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24: 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేస్తే.. సీఎం రేవంత్ రెడ్డి రైతుల నోట్లో మట్టికొట్టిండు. పంద్రాగస్టున రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిండు.' అని ఇబ్రహీంపట్నం మండల రైతులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికకు తాళం వేసి నిరసన తెలిపారు. 'జై జవాన్.. జై కిసాన్' అంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ₹2లక్షల రుణ మాఫీ చేయాలని.. ఎకరానికి ₹7,500చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు ఏలేటి చిన్నారెడ్డి, తీగల రవీందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాంపల్లి రమేశ్, నల్ల మోహన్, కల్లె చిన్నసాయన్న, బాస జలేందర్, బద్ధం సత్తారెడ్డి, సరసం ప్రసాద్‌రెడ్డి, పడాల రాజేందర్, పవన్‌రెడ్డి, తీగల రమేశ్ పాల్గొన్నారు.

## 26న కొదురుపాకకు కేటీఆర్



బోయినపల్లి, సెప్టెంబర్ 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 26న బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన అమ్మమ్మ-తాతయ్య అయిన జోగినపల్లి లక్ష్మమ్మ-కేశవరావు జ్ఞాపకార్థం నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అ'విశ్రాంత' గోస



# రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఏవి?

**ఆరు నెలలైనా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు**

- మార్చి 31 నుంచి జగిత్యాల జిల్లాలో 264 మంది విరమణ
- ఈ ఒక్క నెలలోనే మరో 50 మంది రిటైర్మెంట్
- బెనిఫిట్స్ కోసం ఎదురు చూపులు
- ప్రయోజనాల కోసం కార్యాలయా చుట్టూ ప్రదక్షిణలు
- ప్రభుత్వ తీరుపై విమర్శలు

విశ్రాంత ఉద్యోగుల కడుపు రగులుతున్నది. కాంగ్రెస్ సర్కారు తీరుతో కంట కన్నీరు కారుతున్నది. మూడు, నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలందించి, రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తున్నది. గత ఉద్యోగి విరమణ పొందగానే ప్రయోజనాలు అందగా, ప్రస్తుతం ఆరు నెలలైనా ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నది. గత మార్చి 31 తర్వాత జగిత్యాల జిల్లాలో 264 మంది సర్వీసు నుంచి దిగిపోగా, అందరికీ పెండింగ్‌లోనే పెట్టింది. ఈ నెలలోనూ రిటైర్మెంట్ తీసుకున్న మరో 50 మందికి ఇవ్వనట్టు తెలుస్తుండగా, ప్రభుత్వం వెంటనే స్పందించాలని, వెంటనే సెటిల్ చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

జగిత్యాల, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం అరిగోసపడుతున్నారు. రిటైర్మెంట్ తీసుకొని ఆరు నెలలు దాటినా ప్రయోజనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ తొలి ప్రభుత్వం, రెండో దఫాలో తెలంగాణ ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతో విరమణ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరిగింది. కేసీఆర్ పెంచిన విరమణ వయసు వల్ల నిలిచిపోయిన రిటైర్మెంట్లు ఈ యేడాది మార్చి 31తో ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు 1800 నుంచి 2వేల మంది విరమణ పొందుతూ వస్తున్నారు. ఇప్పటి వరకు అందిన లెక్కల ప్రకారం ఈ ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో 12,296 మంది, జగిత్యాల జిల్లాలో 264 మంది విమరణ పొందారు. సాధారణంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు, ఇతర ప్రయోజనాలు అన్నింటినీ కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేస్తున్నది. సహజంగానే ఉద్యోగి రిటైర్మెంట్ గడువు సమీపిస్తున్న తరుణంలో వారికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించి, వాటి ఆధారంగా రిటైర్మెంట్ తర్వాత వారం పది రోజులు, గరిష్టంగా నెల రోజుల వ్యవధిలో అన్ని ప్రయోజనాలను అందజేస్తూ వచ్చేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ఆరు నెలలు గడిచినా బెనిఫిట్స్ మంజూరు చేయడం లేదు.

### కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వం నుంచి విరమణ ప్రయోజనాలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నారు. రిటైర్ అయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కేసుకొని పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం, తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్న వారు, సొమ్ము చేతికి అందుతుందనే భరోసాతో అప్పులు చేసి కార్యాలను గట్టెక్కించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నెలలు గడుస్తున్నా ఇంకా ఆ విరమణ సొమ్ము చేతికి అందకపోవడంతో సతమతమవుతున్నారు. కొందరు బయట తెచ్చిన అప్పులకు వడ్డీ భారం పెరుగుతున్నదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులతోపాటు సర్వీసు పూర్తవబోతున్న ఏ ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కలిసినా ఇదే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం ఎందుకు బెనిఫిట్స్ మంజూరు చేయడం లేదు, కావాలనే జాప్యం చేస్తుందా..? అసలు ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వం ఇస్తుందా..? ఇవ్వకపోతే పరిస్థితి ఏమిటో? అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఓవైపు చేసిన అప్పులు, వాటికి పెరిగిపోతున్న వడ్డీతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నామంటున్నారు. ప్రభుత్వ వ్యవహారశైలి చూస్తే ఇబ్బందికరంగా ఉందని, ఇలాంటి పరిస్థితి కొనసాగితే 'వృద్ధాప్యంలో ఎలా బతకాలి?' అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇక విరమణ పొందడానికి సిద్ధంగా ఉన్న ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంటున్నది. ఒక వైపు రిటైర్మెంట్ సమయం సమీపిస్తుండడం, ప్రభుత్వం చూస్తే బెనిఫిట్స్ చెల్లింపుల్లో జాప్యం చేస్తుండడంతో వచ్చే సగం వేతనంతో ఎలా బతకాలో..? ఇప్పటి నుంచే భయం వేస్తుందని అంటున్నారు. విరమణ పొంది ఇటు ప్రయోజనాలు అందని పలువురు పెన్షనర్లు, వివిధ సంఘాల నేతల వెంటబడి తిరుగుతూ ప్రయోజనాలు సత్వరం వచ్చేలా చూడాలని కోరుతుండడం నిత్యకృత్యమైపోతున్నది.

### ఆరు నెలలైనా బెనిఫిట్స్ ఇవ్వరా..?

నేను నాలుగు దశాబ్దాలు ప్రభుత్వ ఉద్యోగం చేశా. సాధారణ గుమస్తాగా ఉద్యోగాన్ని ప్రారంభించి, గెజిటెడ్ అధికారి హోదాకు చేరా. 40 ఏండ్ల ఉద్యోగ జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నా. నలభై ఏండ్లు పనిచేసినా నా వ్యక్తిగత సమస్యలు, నా కుటుంబ సమస్యలు ఇంకా పూర్తిగా తీరనే లేదు. ఇళ్లు కట్టినా, పిల్లల పెండ్లి చేసినా, కొడుకును చదివించినా అన్నింటికీ పెద్ద మొత్తంలోనే ఖర్చయింది. ఇంకా అప్పులు ఉన్నాయి. కట్టిన ఇంటికి సంబంధించిన లోన్ బ్యాంకులో అలాగే ఉంది. కొన్ని వెహికిల్ చెల్లింపులు ఉన్నాయి. అయితే 40 ఏండ్ల నుంచి జీపీఎఫ్ పేరిట, ఇతరత్రా పద్ధతుల్లో న్యాయబద్ధంగా కూడబెట్టాను. రిటైర్మెంట్ అయితే అరవై, అరవై ఐదు లక్షలు వస్తాయని లెక్క వేసుకున్నా. ఆ డబ్బులతో అప్పులు చెల్లించాలని ప్రణాళిక చేసుకున్నా. కానీ చాలా దారుణం. విరమణ పొంది ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకు బెనిఫిట్స్ ఇవ్వలేదు. నేను పనిచేసిన ఆఫీస్ చుట్టూ, రిటైర్మెంట్ అయిన ఉద్యోగ సంఘాల నాయకుల చుట్టూ తిరగడానికే సరిపోతోంది. నాలుగు నెలలుగా డబ్బులు ఎప్పుడు వస్తాయోనని..? ఎదురుచూడడమే సరిపోతుంది. ఎప్పుడు బెనిఫిట్స్ ఇస్తారో అర్థం కావడం లేదు. చేసిన అప్పులకు, వడ్డీలు పెరిగిపోతున్నాయి. కానీ రావాల్సిన ప్రయోజనాలు మాత్రం రావడం లేదు.

**- మార్చి 31న విరమణ చేసిన ఓ గెజిటెడ్ స్థాయి అధికారి**

### ప్రయోజనాలు ఇవ్వాల్సింది ఇలా..

విరమణ చెందిన ఉద్యోగికి గ్రాట్యుటీ, వేతనం నుంచి ప్రతి నెలా ప్రభుత్వం వద్ద పొదుపు చేసుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, కమ్యూటేషన్, సరెండర్ లీవులు తదితర రూపేణా ఇవ్వాల్సిన ప్రయోజనాల సొమ్ము ఏకమొత్తంలో విరమణ చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఎంత చిన్న ప్రభుత్వ ఉద్యోగికి అయినా, కనీసం 35 లక్షల నుంచి 70 లక్షల వరకు పెన్షన్ బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుంది. వీటిని చెల్లించడంలో ఆలస్యమైనా వడ్డీ ఏమైనా ప్రభుత్వం ఇస్తుందా..? అంటే అలాంటిదేమి ఉండదు. విరమణ పొందిన ఉద్యోగి ఆరు నెలల కాలానికి తన బెనిఫిట్స్‌కు సంబంధించి ఒక రకంగా బ్యాంకు వడ్డీ చొప్పున లెక్క గట్టినా, ₹3లక్షల నుంచి ₹5 లక్షల వరకు నష్టపోయినట్టే. ఈ ఆరు నెలల కాలంలో విరమణ చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని ప్రయోజనాలు చెల్లించాలని అంటే ₹2వేల కోట్ల నుంచి ₹2600 కోట్ల వరకు అవసరమని అంచనా వేస్తున్నారు. ప్రతి జిల్లాలో వివిధ రకాల చెల్లింపులు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, జగిత్యాల జిల్లాలో రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సత్వరమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



ప్రభుత్వం ఆరు నెలలుగా పెన్షనర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం బాధాకరం. కొత్త ప్రభుత్వం విరమణ ప్రయోజనాలను సత్వరం చెల్లించేలా టీపీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో ఒత్తిడి తెస్తాం. ఇప్పటికే టీజీ జాక్ తరఫున రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో పలుసార్లు ప్రభుత్వానికి విన్నవించాం. అయినా పెద్దగా స్పందన రాలేదు. రిటైర్మెంట్ ఉద్యోగుల గోసలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పెన్షన్ ప్రయోజనాలు చెల్లింపులు చేయించాలని మా అసోసియేషన్ తరఫున కోరుతున్నాం. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ, ఫిట్మెంట్, నగదు రహిత వైద్య సేవలు, కమ్యూటేషన్ రిస్టోరేషన్, రికవరీ పీరియడ్ 15 ఏండ్లు కాకుండా 12 ఏళ్లు పూర్తి కాగానే తగ్గింపు, 20 ఏండ్లకు ఫుల్ పెన్షన్ తదితర సమస్యలన్నీ అలాగే ఉండిపోయాయి. వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం.

**- హరి అశోక్ కుమార్, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు (జగిత్యాల)**




సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్ రావు

## ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్సీ బరిలో ఉంటా

ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 24: కరీంనగర్-మెదక్, ఆదిలాబాద్-నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిల్చుంటున్నానని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రస్మా ద్వారా తాను ప్రైవేట్ ఉపాధ్యాయుల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతోపాటు ప్రతి విద్యార్థి అభ్యున్నతికి ట్రస్మా ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో దాదాపు 1.5లక్షల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని.. వారందరి సహకారంతో రానున్న రోజుల్లో ఎమ్మెల్సీగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన ట్రస్మా బాధ్యులు, ప్రైవేట్ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు, ప్రైవేట్ విద్యాసంస్థల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు



# సింగరేణిలో ఆగ్రహజ్వాల

- లాభాల వాటాలో కోతపై టీబీజీకేఎస్ నిరసన
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

గోదావరిఖని, సెప్టెంబర్ 24: సింగరేణి కార్మికుల లాభాల వాటాలో కోతపై కార్మికులు మండిపడుతున్నారు. టీబీజీకేఎస్ నిరసనల్లో భాగంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా పరిధిలోని ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసనకు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ ప్రకటించిన ₹4,701 కోట్ల లాభాలపై 33 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల శ్రమ, త్యాగానికి విలువ లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్మికులు సాధించి పెట్టిన వాస్తవ లాభాల నుంచి వాటా ఇవ్వకుండా మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు.

# అప్పారెల్ పార్క్‌లో టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్

అప్పారెల్ పార్క్‌లోని గోకుల్ దాస్‌కంపెనీలో దుస్తులు తయారీ చేస్తున్న మహిళలు (ఫైల్)



సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లో రెడీమెడ్ దుస్తుల తయారీకి మరో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఇప్పటికే షెడ్ల నిర్మాణం పూర్తి కాగా, వచ్చే నెలలో రెడీమెడ్ దుస్తుల ఉత్పత్తులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. అలాగే యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. సంస్థలో దాదాపు 2వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉన్నందున నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

- త్వరలో ప్రారంభంకానున్న అంతర్జాతీయ సంస్థ
- రెడీమెడ్ దుస్తుల తయారీకి సన్నాహాలు
- 2వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం
- సిరిసిల్ల జిల్లా యువతకు తొలి ప్రాధాన్యం
- వచ్చే నెల నుంచి దుస్తుల తయారీలో యువతకు శిక్షణ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేనేత జౌళీశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కేటీఆర్, సిరిసిల్ల ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో 88ఎకరాల్లో ₹177కోట్లతో పెద్దూరు శివారులో అప్పారెల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రెడీమెడ్ దుస్తుల తయారీకి జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఇక్కడికి రప్పించేందుకు కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా గోకుల్‌దాస్ ఇమేజ్ కంపెనీ గ్రీన్ నిడిల్ యూనిట్ దాదాపు వెయ్యి మంది మహిళలకు ఉపాధి కల్పించింది. అలాగే మరో అంతర్జాతీయ సంస్థ టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ సిరిసిల్లలో ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చింది. 2022లో ఆ సంస్థ ఎండీ గోయెంక అప్పటి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. అప్పారెల్ పార్క్‌లోని ఏడెకరాల స్థలంలో షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఏడాది కాలంలో పూర్తి చేసిన సంస్థ, దుస్తుల తయారీకి సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే అధునాతన జూకీ మిషన్లు సిరిసిల్లకు చేరుకున్నాయి.



సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లో టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ కంపెనీ షెడ్డు

ప్రస్తుతం 2వేల మంది యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో వచ్చే నెలలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కంపెనీకి కావాల్సిన సిబ్బంది, హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్, సూపర్‌వైజర్లను నియమించింది. కాగా గత ప్రభుత్వం టెక్స్‌టైల్స్ పార్కులో ఏర్పాటు చేసిన దుస్తుల తయారీలో నైపుణ్య శిక్షణ పొందిన వారు సైతం ఈ కంపెనీలో చేరేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. తొలి విడుతలో 800మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగం కల్పించనున్నట్లు సంస్థకు చెందిన ఉద్యోగులు తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పించిన ఈ సంస్థ సిరిసిల్లలో ప్రారంభమైతే నిరుద్యోగులకు వరంగా మారనున్నది. నెలకు ₹10వేలకు పైగా వేతనాలు పొందే అవకాశం ఉన్నది.

### జిల్లా యువతకు ప్రాధాన్యం

త్వరలో ప్రారంభంకానున్న టెక్స్‌పోర్టు ఇండస్ట్రీస్ కంపెనీలో జిల్లా యువతకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఈ కంపెనీలో ఉపాధి పొందేందుకు జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి దరఖాస్తులు చేసుకుంటున్నారు. దసరా పండుగ వరకు ఉత్పత్తులు ప్రారంభించేలా చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. మరిన్ని సంస్థలను సిరిసిల్లకు రప్పించేందుకు మాజీ మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నట్లు తెలిసింది.

# ఆశకుపోయి లబోదిబో

- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన మహిళ
- ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెట్టిన ₹1.78లక్షలు మటాష్



జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 24: అధిక ఆదాయానికి ఆశపడ్డ ఓ గృహిణి సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయింది. ₹1.78లక్షలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నది. ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెడితే అత్యధిక లాభాలు పొందవచ్చని సెల్‌కు మెసేజ్ రావడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన గృహిణి నమ్మింది. పలు దఫాలుగా పెట్టుబడి పెట్టడంతో అధిక ఆదాయం వచ్చింది. ఈ క్రమంలో ఇటీవల యాప్‌లో ₹1.78లక్షల పెట్టుబడి పెట్టింది. తర్వాత నిర్వాహకులు యాప్‌ను మూసివేయడంతో తాను మోసపోయానని గ్రహించింది. వెంటనే జగిత్యాల టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పెద్ద ఎత్తున నగదు పోవడంతో బోరుమంటున్నది.



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు

# రాజన్న హుండీ ఆదాయం @ ₹కోటీ44 లక్షలు

కేవలం 12రోజుల్లో సమకూరిన నగదు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 24: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఓపెన్ స్లాబ్‌పై మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ మేరకు కోటీ 44లక్షల 6వేల 154 రూపాయల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. అలాగే 710గ్రాముల బంగారం, 14కిలోల వెండి సమకూరిందని, ఈ ఆదాయం కేవలం 12రోజులది మాత్రమేనని ఆయన వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ, ఏఈవోలు, పర్యవేక్షకులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.